క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ముత్తుకూరు: ముత్తుకూరు ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా ఆదివారం ఆక్రమణలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. మురుగు కాలువలను సైతం ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగిస్తున్నారు. ఆర్అండ్బీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో దుకాణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగిస్తున్నారు. అవసరమైన చోట యంత్రం సాయంతో చదును చేస్తున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నెల్లూరు నుంచి ముత్తుకూరు వరకు రోడ్డు విస్తరణ చేపట్టిన నేపథ్యంలో ఈ ఆక్రమణల తొలగింపు చేపట్టారు. సోమవారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

అంబేడ్కర్ ఆశయాల్ని కొనసాగిద్దాం

కోవూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని డీఎల్డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి కోరారు. మండలంలోని పడుగుపాడు ఎస్సీకాలనీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో విగ్రహ నిర్వాహకులు ఎల్లు శ్రీనివాసులు, తలారి సుబ్బయ్య, ఆములూరు సతీష్, అంబేడ్కర్ యువజన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

పొదలకూరు: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో నిర్మాణం పూర్తయిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధ్వజస్తంభ, ద్వారపాలక, లక్ష్మీగణపతి, నర్మదాబాణలింగం, అయ్యప్ప, అభయాంజనేయ, గరుడాళ్వార్, విమానకలశం, మహారాజ సంప్రోక్షణ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట ఉత్సవాల సందర్భంగా నిత్యం మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలు గాలిపాళెం చినవెంకయ్యస్వామి ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

పత్తి సాగులో మెళకువలు పాటించాలి

పొదలకూరు: పత్తి సాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఎ.వాసు తెలిపారు. ఆదివారం ఏఓ విలేకరులతో మాట్లాడుతూ వరిసాగు చేయలేని రైతులు పత్తి సాగు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో వావింటపర్తి, మహ్మదాపురం, పీజీపటౢం, బిరదవోలు, తాటిపర్తి, చెన్నారెడ్డిపల్లి, చిట్టేపల్లి, ఇనుకుర్తి, డేగపూడి, మొగళ్లూరు, వరదాపురం తదితర గ్రామాల్లో సుమారు 1,200 ఎకరాల్లో పత్తిసాగు అవుతున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన మేరకు రైతులు పత్తిసాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

తీరంలో సందడి



కోడూరు బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తున్న సందర్శకులు

తోటపల్లిగూడూరు: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్ ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో సేదతీరేందుకు జిల్లా నలువైపుల నుంచి కోడూరు సాగరతీరానికి సందర్శకులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో కోడూరు బీచ్ పరిసరాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి.

మా పార్టీతోనే దేశాభివృద్ధి

పొదలకూరు: తమ పార్టీ కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని పార్లపల్లి, బిదరవోలు ఎస్సీకాలనీల్లో ఆయన పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి సంబంధించిన వస్తువులపై కూడా జీఎస్టీ విధిస్తూ రైతుల నడ్డివిరుస్తోందని ఆరోపించారు.

తాగునీటి కష్టాలకు స్వస్తి

గత నలభై ఏళ్లుగా బుచ్చిరెడ్డిపాళెం పట్టణ ప్రజలు తాగునీటి కోసం పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఒక పూట నీరు వస్తే మరో పూట వచ్చేవి కాదు. దశాబ్దాల నాటి ఈ సమస్య కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో త్వరలో తీరనుంది. నిధులు మంజూరు కావడంతో త్వరలో టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించనున్నారు.

- తీరనున్న బుచ్చి ప్రజల దాహార్తి
- సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే ప్రసన్న
- అమృత్ 2.0 పథకం కింద రూ.85 కోట్లు మంజూరు
- త్వరలోనే టెండర్లు

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో త్వరలో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ ప్రజల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. బుచ్చి నగర పంచాయతీ ఏర్పడిన ఆరు నెలల వ్యవధిలోనే ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలను తీర్చేందుకు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతోపాటు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి, పురపాలకశాఖ అధికారులకు నివేదికలు పంపారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. త్వరలోనే ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి త్వరగా పనులు ప్రారంభించేందుకు అధికారులు ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించారు.



బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వ్యూ

రూ.85 కోట్లు మంజూరు

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో ఉన్న సుమారు 50 వేల మంది ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. కాగా ప్రభుత్వ ప్రతిపాదనలతో ఇటీవల అమృత్ 2.0 పథకం కింద రూ.85 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.34.33 కోట్లు, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.40 కోట్లు, రాష్ట్ర పురపాలకశాఖ వాటా రూ.1.29 కోట్లు, 15వ ఆర్థిక సంఘం వాటా రూ.4.38 కోట్లు, నిర్వహణ ఖర్చుల కింద మరో రూ.5 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. దీంతో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సంగం బ్యారేజ్ వద్ద పాయింట్‌ను ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ అధికారులు(ఫైల్)

తాగునీరు అందించేదిలా..

- ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సంగం బ్యారేజ్ వద్ద వాటర్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తారు.
- అక్కడ నుంచి బ్యారేజ్‌కు సమీపాన ఉన్న కొండ పైకి నీటిని మోటార్ల ద్వారా పంపింగ్ చేసి అక్కడ ఏర్పాటు చేసిన ఫిల్టర్ పాయింట్‌లో వాటర్‌ను ఫిల్టర్ చేస్తారు.
- ఫిల్టర్ చేసిన నీటిని అంతర్గత అధునాతన పైపులైన్ల ద్వారా దాదాపు 15 కిలోమీటర్ల మేర బుచ్చిరెడ్డిపాళేనికి తరలిస్తారు.
- బుచ్చిరెడ్డిపాళెంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 5 ఓవర్ హెడ్ ట్యాంకుల్లో ఫిల్టర్ చేసిన నీటిని నింపుతారు.
- ఓవర్ హెడ్ ట్యాంకుల్లో నింపిన మంచినీటిని నగర పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తారు.
- ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి ప్రజలకు అందించనున్నారు.
- ఇందులో భాగంగా ఇప్పటికే ఆయా ప్రాంతాలను పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ అధికారులు పరిశీలించారు.

నగర పంచాయతీ – బుచ్చిరెడ్డిపాళెం	
వార్డుల సంఖ్య 20	జనాభా – సుమారు 50 వేల మంది
తాగునీటి సమస్య పరిష్కారానికి మంజూరైన నిధులు రూ.85 కోట్లు	

మంచినీటిని అందించడమే లక్ష్యం



బుచ్చిరెడ్డిపాళెంలోని 20 వార్డుల్లో ఉన్న సుమారు 50 వేల మంది ప్రజలకు మంచినీటిని అందించడమే లక్ష్యం. ఇందుకోసం 2020 సంవత్సరంలో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీగా ఏర్పడినప్పుడే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. స్వయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించాం. అమృత్ 2.0 కింద రూ.85 కోట్ల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే బుచ్చిరెడ్డిపాళెం ప్రజలకు సమృద్ధిగా మంచినీరు అందిస్తాం.

– నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కోవూరు

రుణపడి ఉంటాం



బుచ్చిరెడ్డిపాళెం ప్రజల తాగునీటి అవసరాల కోసం శ్రమించి నిధులు మంజూరు చేయించిన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ఎప్పటికి రుణపడి ఉంటాం. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాం. త్వరలోనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

– మోర్ల సుప్రజ, చైర్‌పర్సన్, బుచ్చిరెడ్డిపాళెం

త్వరలోనే టెండర్లు



తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి పాయింట్, ఫిల్టర్, పైపులైన్, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణ ప్రాంతాలను పరిశీలించాం. త్వరగా టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ

నేడు ముత్తుకూరులో 'గడప గడపకు..'

ముత్తుకూరు: ముత్తుకూరు పంచాయతీలో సోమవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొంటారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు యుడైస్‌పై హెచ్‌ఎంల సమావేశం

కొడవలూరు: మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల హెచ్‌ఎంలతో యుడైస్(యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్)పై సోమవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జి.వసంతకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమవుతుందని తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ స్కూళ్ల హెచ్‌ఎంలు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు అనుసరించాల్సిన ప్రణాళికలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

కార్పొరేషన్ డైరెక్టర్‌గా తిరుపతి కొనసాగింపు



బుచ్చంగారి తిరుపతి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విడవలూరు మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు బుచ్చంగారి తిరుపతిని మరో రెండేళ్లపాటు ఆ పదవిలో కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వం పదవీకాలాన్ని పొడిగించింది. తన పదవీకాలం పొడిగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల రెండు నాల్కల ధోరణితో మాట్లాడే చంద్రబాబును రాష్ట్ర ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మరని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ముత్తుకూరు పంచాయతీలోని ఎమ్మార్వో కాలనీ, ఎరుకుల కాలనీ, చలివేంద్ర తదితర ప్రాంతాల్లో ఆరో రోజు ఆదివారం కూడా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.1.04 కోట్లతో నిర్మించిన చలివేంద్ర సీసీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేత చంద్రబాబు తనయుడు లోకేష్‌బాబు చేపట్టేబోయే యువగళం కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు మంచి వినోదం కలిగిస్తుందన్నారు. వర్ధంతికి, జయంతికి తేడా తెలియని చినబాబు యువగళం ఒక కామిడీ షోగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరువరని, మళ్లీ ఆదరిస్తారని తెలిపారు.

రూ.12 కోట్లతో రోడ్డు విస్తరణ

నెల్లూరు నుంచి ముత్తుకూరు మీదుగా వెంకటాచలం జాతీయ రహదారి వరకు రోడ్డు విస్తరణ కోసం రూ.12 కోట్ల నిధులు విడుదల చేశామని మంత్రి కాకాణి తెలిపారు. ఇందులో భాగంగా ముత్తుకూరు, సర్వేపల్లిలలో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చోట్ల విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి టీడీపీ నేతలు ఓర్వలేకపోతున్నారని మంత్రి విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బండెల వెంకటరమణయ్య, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు షేక్ నవీద్ బాషా, నాయకులు కె.లక్ష్మణరెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, మునుకూరు జనార్దన్‌రెడ్డి, సీపారెడ్డి రామమోహన్‌రెడ్డి, ముత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్వో కాలనీలో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నిర్మాణం పూర్తయిన సీసీరోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కాకాణి

కమనీయం వెంకటేశుని కల్యాణం

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆదివారం రాత్రి వెంకటేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ముందుగా వెంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మి గోదాదేవి అమ్మవార్లను ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అర్చకులు మంత్రోచ్ఛారణల మధ్య శ్రీవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ బాధ్యులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్, కె.వేణుగోపాల్, డి.శ్రీనివాసులు, ఎస్.మురళి, చొప్పా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

నూతన మార్పులపై అవగాహన పెంచుకోవాలి

కోవూరు: వ్యవసాయంలో వస్తున్న నూతన మార్పులపై రైతులు మరింత అవగాహన పెంచుకోవాలని పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో సాగులో ఉన్న పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రైతులు హరిప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విజయసాయిరెడ్డి, సన్నత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరి పంట పరిశీలిస్తున్న సొసైటీ చైర్మన్ తదితరులు

బాధితుడికి చేయూత

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): కల్లు గీస్తూ చెట్టు మీద నుంచి పడి గాయాలపాలైన విడవలూరుకు చెందిన కల్లుగీత కార్మికుడు పర్చూరి నాగరాజుకు ఆదివారం అతని నివాసంలో జిల్లా గౌడ్ కల్లుగీత పారిశ్రామిక సంఘం, జిల్లా గౌడ్ సంఘ సేవా సమితి ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా గౌడ్ కల్లుగీత పారిశ్రామిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్ మాట్లాడుతూ సేవా సమితి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత కోసూరు గోవిందయ్య ఆశయాల మేరకు గాయపడిన కల్లుగీత కార్మికులకు చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రంగయ్య, రామకృష్ణ, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, ఎస్.మల్లికార్జున్, చిన్నగోవింద్, అంకయ్య, గోపాల్, రవీంద్ర, మోహన్, సుబ్బారావు, ప్రశాంత్, గోవర్ధన్ పాల్గొన్నారు.



నాగరాజుకు నగదు అందజేస్తున్న నాయకులు

క్రికెట్ పోటీల విజేత పొదలకూరు జట్టు

పొదలకూరు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణంలోని ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో పొదలకూరు ఫ్రెండ్స్ జట్టు విజేతగా నిలిచింది. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల జట్టు రన్నర్‌గా నిలిచింది. ఆదివారం స్థానిక క్రీడా మైదానంలో ముగింపు సమావేశం నిర్వహించి సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ చేతులమీదుగా విజేత, రన్నర్ జట్లకు రూ.10,116, రూ.7,116 నగదు బహుమతులు అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పొదలకూరుకు చెందిన విష్ణు, ఆమంచర్లకు చెందిన నిరీక్షణ్ నిలిచారని టోర్నమెంట్ ఆర్గనైజర్ మన్నవరపు రవికుమార్‌యాదవ్ తెలిపారు. ప్రథమ బహుమతి నగదును ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మూలి సతీష్ కుమార్‌రెడ్డి, ఎస్కే అంజాద్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుతో సర్పంచ్ చిట్టెమ్మ, నాయకులు

నేడు పడుగుపాడులో 'గడప గడపకు..'

కోవూరు: మండలంలోని పడుగుపాడు గ్రామంలో సచివాలయం–2 పరిధిలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీసీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బైక్ అదుపుతప్పి..

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి పడిపోయి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరం వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన అశోక్‌కుమార్, అతని స్నేహితుడు ప్రదీప్ పనినిమిత్తం బైక్‌పై గొలగమూడికి వచ్చారు. తిరిగి నెల్లూరుకు వెళుతుండగా పెట్రోల్ బంకు సమీపంలో ఎదురుగా ట్రాక్టర్ అడ్డు రాగా బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న అశోక్‌కుమార్, ప్రదీప్‌లకు గాయాలు కాగా వాహనదారులు వారిని చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా పోలీస్ రాత పరీక్ష



బుచ్చిరెడ్డిపాళెం: అభ్యర్థుల హాల్‌టిక్కెట్లు పరిశీలిస్తున్న పోలీసు అధికారి

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక వివేకానంద, శ్రీకృష్ణ చైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ఆదివారం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. బుచ్చిరెడ్డిపాళెం సీఐ జి.రామారావు, ఎస్సై వీరప్రతాప్ ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఈ పరీక్షకు అభ్యర్థులు ముందుగానే ఆయా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. వివేకానంద పాఠశాలలో 300 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 27 మంది గైర్హాజరయ్యారు. శ్రీకృష్ణ చైతన్య పాఠశాలలో 408 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 27 మంది గైర్హాజరైనట్లు సీఐ రామారావు తెలిపారు. పరీక్ష సమయంలో అభ్యర్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించామని తెలిపారు.

ప్రశాంతంగా..

కోవూరు: జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ సందీప్‌కుమార్ తెలిపారు. గంగవరం గీతాంజలి కళాశాల వద్ద, జేబీఆర్ ప్రభుత్వ పాఠశాల వద్ద కోవూరు సీఐ కె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇందుకూరుపేట, కోవూరు ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు. కోవూరులోని గంగవరం గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ సీహెచ్ విజయారావు పరిశీలించారు.

వెంకటేశ్వర కళాశాలలో..

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఇక్కడ రాత పరీక్షకు 720 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 42 మంది గైర్హాజరయ్యారు. ఎస్సై జి.సుబ్బారావు పరీక్ష పగడ్బందీగా జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రిలిమినరీ రాత పరీక్ష

వెంకటాచలం: కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ రాత పరీక్ష వెంకటాచలంలోని క్యాబా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఈ పరీక్షకు అభ్యర్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు.